

# ఇది మా నాయినిచ్చిన ఆస్తి!

చీకటితో నిద్రలేచే పనికంటే ఇంకో నామర్దాపని మా ఇంట్లో మేమెరగం.

ఆ మాటకొస్తే తెల్లగా తెల్లారిపోయినాకనే దుప్పట్లో ముడుక్కుంటా, మద్యమద్యలో మేలుకుంటా, ఒకరినొకరం కరచుకొని పొణుకోవడంలో వుండే మజా మేమెరిగినంతగా యింకెవురూ ఎరిగుండరు.

ఒకాల, ఎప్పుడన్నా యిస్కూళ్లకనిజెప్పి మా అమ్మ మమ్మల్ని తొందరగా నిద్రలేపబోతే దేవుడిలాంటి మా నాయిన- ఆయన అలివిగాని దయతోటి 'యింత పొద్దున్నే లేచి నా బిడ్డలు రాజ్జాలేలాలంటమ్మే... కాసేపు పొణుకోనీ' అంటా మా తమ్ముణ్ణి గెట్టిగా గుండెలకదుముకునే వోడేగానీ మాకై మేము లేచేంతదాకా నిద్రలేవనిచ్చేవాడు కాదు.

అట్టా ఆలిశ్యంగా నిద్రలేవడమనే ఆస్తిని మా నాయిన పదిలంగా దాచిపెట్టి మాకు దారాదత్తం చేస్తా వుంటే మా అన్నతో నాతో పాటు మా చెల్లెలు కూడా బాగానికొచ్చింది,

'మీరేనా బాగస్తులు నేనుకానా?' అంటా. నిజ్జంగానే నిద్రపోవడంలో మేము శేరైతే మా చెల్లెలు సవాశేరు.

'యీ అమ్మి యీ వొయసులోనే యిట్టా నిద్రపోయి సస్తా వుందే రేపు పెద్దయినాక అత్తతో ఖాయంగా చాకిరీ చేయిస్తుందిది' అంటా మా నాయినమ్మ మా చెల్లెలి నిద్రని ఆచ్చర్యపోయి చూస్తా ఉండేది.

మా నాయినమ్మకు తోడు మా అమ్మ కూడా రొంత పెందలకాణ్ణే లేచిన పుణ్యానికి 'ఊరంతా మేలుకునేసినా ఈ అబ్బా బిడ్డలకు మెలుకవ రాదేందమ్మా' అంటా మా చెవులకాడ చేరి డైలాగులు నూకతా వుండేది.

అయినా సరే- మా నిద్ర చెదిరేది కాదు!

లేటు నిద్ర వల్ల మాకు చిల్లరమల్లర నష్టాలొచ్చినాయిగానీ అవి పెద్దగా లెక్కలోనికి తీసుకునేవి కావు.

అయినా మాట వరసకు రొన్ని చెబుతా.

మా నాయిన- చీకటితో పనంటే చాలు కోటి రూపాయలు తెచ్చి కాళ్ల ముందర కుమ్మరించినా సరే కదిలేవాడు కాదు. అదే రేత్రిపూట పనైతే... ఒంటి గంటా.. రొండైనా సరే... సిగిరెట్లు టీలు తాగతా కళ్ళు డబ్బిల్లాగా తెరుచుకొని కూచునేవాడు.

శ్లాబులో పైపులు పెట్టాలనో, బావిలో నీళ్ల మోటారు బిగించాలనో ఏ రెడ్డన్నా పొద్దున్నే మా నాయిన ఎంబడిపడి 'బాబ్బాబు... నాయిన్నాయినా' అని బతిమిలాడితే- మా నాయిన నిద్రకళ్లతో లేచి,'నీకెందుకు నువు పా భాయ్. అయిదే అయిదు నిమిషాల్లో ఆడుంటా' అని ఝూటా భరోసా యిచ్చేవాడేగానీ యింట్లోకొచ్చినాక పదిగొంటలైనా ముసుగు తీసేవాడు కాదు. అందువల్ల మా నాయిన చేయాల్సిన కొన్ని పనులు పక్కోళ్ల పాలకుబోయేవి.

యింక నాకు వచ్చిన సుకమైన నష్టమేమిర్రా అంటే పొద్దున పూట పర్వేట్ శాశ్వితంగా ఎగనామం కావడం! ఏ టుటోరియల్స్‌లో అయినా సరే, పొద్దున పూట రాననే కండీషను పెట్టి మరీ చేరతాను కాబట్టి సాయింత్రాలు పోకపోతేనే మా యింట్లో నాకు పనిష్మెంటు. పొద్దున పోకపోతే లా.

(ఈ అలవాటును షేకు చిన నవాబు లెవిల్లో చదువుకున్నంత కాలం కొనసాగించినాను. మా జవహర్‌బారతి కాలేజీలో పొద్దున ఏడున్నరకు కిలాసులు మొదలయినా లేటుగా నిద్రలేచే అలవాటు వల్ల ఏనాడూ ఫస్టు పిరీడుకు పోయిన పాపమెరగలా. కానీ ఒక్కసారి తిన్నాను జలదంకి కండె. నేను సీనియర్ ఇంటరులో ఉండగా నా మీద పగబట్టినట్టుగా మా ప్రసాదయివోరు పొద్దున ఆరింటికి పెట్టినాడు లెక్కల ట్యూషను. నా బాద బాద కాదు. మరీ

అంత పొద్దున్నే లేవడం వల్లగాక యిప్పుడొకసారి అప్పుడొకసారి పోయి ఆ తర్వాత మొత్తంగా ఎగనామం పెట్టేసినాను. ఫలితంగా చావుతప్పి కన్ను లొట్టబోయి- ఫైనలు పరీక్షల్లో ఫెయిలు కాకుండా సరిగ్గా ప్యాసు మార్కులతో బతికి బయట పడగలిగినాను. ఆ ఒక్క సబ్జెక్టు కొట్టిన దెబ్బకి నాకు ఇంటరులో సెకండ్ కిలాసు వచ్చింది).

సరే అయన్నీ పోనీండిగానీ మా యింట్లో నిద్రలేచిన ఎమ్మట్నే వేడివేడిగా టీ పెట్టుకునే తీరు చెబుతా.

పావుకేజీ పాకెట్లు, వంద గ్రాముల పాకెట్లుండే టీ ఆకును మా నాయిన ఎప్పుడు తెచ్చినా ఒకటికి నాలుగుసార్లు టీ పెట్టుకొని కానూకేస్తాము కాబట్టి మా యింట్లో టీ అంటే తేపతేపకీ బిస్మిల్లాయే.

మా అమ్మోళ్లి పాతశెట్టి కాణ్ణుంచి దారానికి వేళాడుతున్న సూపర్‌డస్టు పాకెట్లు పది పైసలవి అయిదుగానీ, పావలావి రొండుగానీ తెచ్చినాకనే మాకు టీ. పావలా పాకెట్లులే నాలుగు తెచ్చిందంటే ఆ పూట స్ట్రాంగు టీ తాగబోతున్నట్టు లెక్క. (యీ పాకెట్ల మీదుండే పావల బిళ్ల, పైది పైసల బిళ్లలను చింపుకొని ఆటల్లో క్యాషులాగా వాడుకునే వాళ్లం మేము).

టీ పాకెట్లు తెచ్చినాక టీ పెట్టేంత సేపూ అందరం కాసుకోని వుంటాం. ఎప్పుడైతే మా అమ్మ చెంబులోకి టీని వడగడుతుందో అప్పుడిక ఎటాకే! పాచిపళ్లతో జొళ్లు మొకాలతో వేడివేడిగా తాగతా వుంటే సామీ... (పళ్లు తోముకున్నాక టీ తాగే వాళ్లందరూ ఆ రుచిని మిస్సయినట్టేనబ్బా).

ఒకోరోజు మేము లేటుగా లేవడం వల్ల పాలు సంకనాకిపోతాయి గదా... అప్పుడు కూడా మా టీనీళ్లకొచ్చిన డోకా ఏమీలా. రూపాయి బిళ్లొకటి చేతిలో పెట్టి, యిస్టీలు చెంబు కడిగిచ్చి 'రే అబయా.. క్రిష్ణా ఓటలకు పోయి అయిదు స్ట్రాంగ్ టీలు పోయించుకొని రాపో' అంటుంది మా అమ్మ.

క్రిష్ణా ఓటల్లోని అరంవోడు టీ పోసినాక, చెంబు మీద జాగ్రత్తగా యిస్తరాకు కప్పుకొని ఎంత బేగిగా నడిచే వాణ్ణంటే ఇంటికొచ్చేసరికి టీ వేడి రొంత కూడా తగ్గేది కాదు. (అయితే ఓటలు టీ తెచ్చినప్పుడల్లా సమాన బాగాల కోసం మా యింట్లో తకరారు జరగతా వుండేది. గిలాసు పట్టుకొని 'యింకొచెం మా యింకొచెం' అని ఎంబడిబడితే చెంబు వొంచినట్టుగా వొంచి టీ పోసినట్టుగా యాక్షను చేసేది మా అమ్మ).

యిట్టా టీనీళ్లకు కొట్టుకుంటా పగలు తప్పితే వేకువ చూడకుండా బతకతా వుండిన మేము చీకటితో నిద్రలేచేసిన రోజొకటుంది.

అదే 'ఆఖరీ చహోర్షంబ'! అంటే మేము సముద్రస్నానాలు చేసే రోజు.

ఆ రోజు పొద్దున్నే మా షమ్మీమ్మ వాళ్ల నాయిన తెచ్చిన ఖాళీ లారీకి టార్బుల్ పట్టా కట్టి మా వీది వాళ్లమంతా కూచొని తుమ్మలపెంట సముద్రానికి పోతావుంటే... చల్లటి గాలినీ, బూడిద రంగులోని మబ్బుల్నీ, అప్పటికే మేలుకునేసిన పిచికల్నీ, వీదుల్నీ... ప్రతీదాన్ని నోర్లెళ్ల పెట్టుకొని చూడటమే. ఎందుకంటే పుట్టి బుద్దెరిగినాక అంత వేకువజాముున వాటిని నేను చూళ్లా.

సముద్రం కాడికి పోయినాక వెంటనే స్నానాలకు దిగకుండా మేమందరం ఇసికలో కూలబడ్డాం - నిద్రలేవబోతున్న సూర్యుణ్ణి చూడ్డానికి.

కాసేపటికి సముద్రానికి ఆ పక్క- నీళ్ల మీద తేలతా - మిఠాయి రంగులో సూర్యుడు!

మాకు పట్ట పగ్గాల్లేవు. 'హోయ్! సూరీజ్' అంటా అందరం కేరింతలు కొడ్తా సూర్యుడికి చేతులూపతా వెల్కమ్ చెప్పినాము. మాతో పాటు పెద్దోళ్లు కూడా తొలిసారి చూస్తా వున్నట్టుగా కళ్లు యింతింత చేసుకొని చూసినారు సూరీణ్ణి.

మా అమ్మ మా తమ్ముణ్ణి వొళ్లో కూచోబెట్టుకొని వాడి చేత కూడా చేతులూపిస్తా వుంది. అప్పుడు మా అమ్మ పక్కన కూచున్న మా నాయిన, కూచున్నోడు కూచున్నట్టు వుండకుండా 'ఏంతైనా పొద్దున్నే నిద్ర మేలుకుంటే బాగానే వుండేటట్టుంది మే' అన్నాడు నోరావలిస్తా!

మా అమ్మ చేతులూపడం ఆపి మా నాయిన తట్టు చురచురా చూసింది.

పనిలో పడితే ఇంటినీ, ఇంటికొస్తే పనినీ, నిద్ర పోయినాడంటే అసలకీ లోకాన్నే మర్చిపోయే మా నాయిన్ని- యాడ ఏమి జరిగినా మనకెందుకలే అనుకొని తన మానాన తాను బతికే బంగారం లాంటి మా నాయిన్ని మా అమ్మ చురచురానే చూస్తా 'పొద్దున్నే మేలుకోబళ్లేదు నాయినా. అసలికి మేలుకుంటే చాలు' అనింది. అన్నాక సూర్యుడి వైపు తల తిప్పుకునింది.



ఆఖరీ చహార్షుంబ: అంటే ఆఖరి బుదవారం అని అర్దం. ఒకసారి మా మహమ్మదు ప్రవక్త జబ్బుపడి కొన్నాళ్లకు కోలుకున్నాడంట. కోలుకున్నాక యింట్లో నుంచి బయిటికొచ్చి కాసేపు అట్టా పచ్చిక బయళ్ల మీద నడిచినాడంట. ఆయన బాగయిన మంచిరోజుకు గుర్తుగా ఆఖరీ చహార్షుంబ పేరుతో సముద్రస్నానాలు చేస్తారు కొంతమంది. యింకొందరు పచ్చిక ప్రాంతాలకెళ్లి తిరిగేసి వస్తారు. అయితే ప్రవక్త అస్వస్తతకీ యిట్టా ఆఖరీ చహార్షుంబ జరుపుకునేదానికి ఏమీ సంబందం లేదని కూడా కొందరు అంటుంటారు.